# తొలి సీఎన్‌జీ బైక్ వచ్చిందోచ్..

## ఫ్రీడమ్ 125 పేరిట ఆవిష్కరించిన బజాజ్ ఆటో
## ధరల శ్రేణి రూ.95,000-1,10,000

### ఫీచర్లు, మైలేజీ విశేషాలివే..

- *స్టార్టింగ్ వేరియంట్ డ్రమ్ బైక్ ధర రూ.95,000.*
- *మీడియం మాడల్ డ్రమ్ ఎల్‌ఈడీ బైక్ రేటు రూ.1,05,000.*
- *టాప్-ఎండ్ వేరియంట్ డిస్క్ ఎల్‌ఈడీ బైక్ ఖరీదు రూ.1,10,000.*
- *కేజీ సీఎన్‌జీకి 102 కిలోమీటర్ల మైలేజీ. ఫుల్ ట్యాంక్ (2 కేజీ సిలిండర్) చేస్తే దాదాపు 200 కిలోమీటర్ల దూరం ప్రయాణించవచ్చు.*
- *సీఎన్‌జీ అయిపోతే పెట్రోల్ ఆధారంగా కూడా బైక్ నడుస్తుంది.*
- *బైక్‌లో 2 లీటర్ల పెట్రోల్ ట్యాంక్ ఏర్పాటు. ఇందులోని ఇంధనం ద్వారా 130 కిలోమీటర్లకుపైగానే వెళ్లవచ్చు.*
- *ఎబోనీ బ్లాక్, కరేబియన్ బ్లూ, సైబర్ వైట్, రేసింగ్ రెడ్, ప్యూటర్ గ్రే కలర్లలో బైక్స్ అందుబాటులో ఉంటాయి.*
- *రౌండ్ ఎల్‌ఈడీ హెడ్‌ల్యాంప్, బ్లూటూత్ కనెక్టివిటీతో ఎల్‌సీడీ ఇన్‌స్ట్రూమెంట్ కన్సోల్ సౌకర్యం.*
- *125సీసీ ఇంజిన్, టెలిస్కోపిక్ ఫోర్క్స్ ప్రభావవంతమైన బ్రేకింగ్ వ్యవస్థ ఏర్పాటు.*

పుణె, జూలై 5: ప్రపంచంలోనే తొలి కంప్రెస్డ్ నాచురల్ గ్యాస్ (సీఎన్‌జీ) ఆధారిత మోటర్‌సైకిల్‌ను 'ఫ్రీడమ్ 125' పేరిట భారతీయ సంస్థ బజాజ్ ఆటో ఆవిష్కరించింది. శుక్రవారం ఇక్కడ కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ సమక్షంలో బజాజ్ ఆటో ఎండీ రాజీవ్ బజాజ్ ఈ నయా బైక్‌ను పరిచయం చేశారు. అయితే తొలుత మహారాష్ట్ర, గుజరాత్‌ల్లో మాత్రమే అందుబాటులో ఉండనున్న ఈ టూవీలర్.. ఆ తర్వాత దేశంలోని మిగతా రాష్ట్రాల మార్కెట్లలోకి కూడా వస్తుందని కంపెనీ ప్రకటించింది. కాగా, పర్యావరణహిత వాహనాలపై వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) రేట్లను తగ్గించాలని ఈ సందర్భంగా రాజీవ్ బజాజ్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

**మూడు వేరియంట్లలో..**

ఫ్రీడమ్ 125 సీఎన్‌జీ బైక్‌ను బజాజ్.. మొత్తం మూడు వేరియంట్లలో తీసుకొచ్చింది. అవే.. డ్రమ్, డ్రమ్ ఎల్‌ఈడీ, డిస్క్ ఎల్‌ఈడీ మాడళ్లు. ఇండియా ఎక్స్‌షోరూం ప్రకారం ఈ బైక్‌ల ధరలు రూ.95,000-1,10,000 మధ్య ఉన్నాయి. దేశవ్యాప్తంగా ఉన్న ఆథరైజ్డ్ బజాజ్ షోరూంలతోపాటు సంస్థ అధికారిక వెబ్‌సైట్‌లో ఈ మోటర్‌సైకిల్స్‌ను బుక్ చేసుకోవచ్చు. ఇక 5 కలర్లలో లభించే ఈ బైక్‌లలో సీఎన్‌జీ కోసం ఒకటి, పెట్రోల్ కోసం ఇంకొకటి మొత్తం రెండు ఇంధన ట్యాంక్‌లున్నాయి. వీటికి వేర్వేరు స్విచ్‌లుంటాయి. ఏది ఆన్ చేస్తే అందులోనే బైక్ నడుస్తుంది. ఈ ప్రక్రియ ఎంతో సులభంగా ఉంటుందన్న బజాజ్.. రెండు ట్యాంక్‌లను ఫుల్ చేస్తే మొత్తంగా 330 కిలోమీటర్లు ప్రయాణించవచ్చని పేర్కొన్నది.

**ఖర్చు సగానికి తగ్గుతుంది..**

ఫ్రీడమ్ 125 వినియోగదారులు తమ ఇంధన ఖర్చును 50 శాతానికి తగ్గించుకోగలరని బజాజ్ చెప్పుకున్నది. సీఎన్‌జీ వాడకంతో కిలోమీటర్ ప్రయాణ ఖర్చు రూపాయి, అంతకన్నా తక్కువేనన్నది. కేవలం పెట్రోల్ ఆధారంగానే నడిచే బైక్‌ల ప్రయాణ ఖర్చుతో చూస్తే ఇది సగమేనని గుర్తుచేసింది. ఈ క్రమంలోనే ఫ్రీడమ్ 125 ఓనర్లు ఇతర 125సీసీ బైక్ రైడర్లతో పోల్చితే ఐదేండ్లలో రూ.75,000 వరకు ఆదా చేసుకోవచ్చని బజాజ్ ఆటో తెలియజేసింది. ప్రస్తుతం 75 శాతానికిపైగా టూవీలర్ కస్టమర్ల ఆందోళన పెట్రోల్ ఖర్చేనని, ఫ్రీడమ్ 125 అలాంటి వారికోసమే తెచ్చామని ఈ సందర్భంగా బజాజ్ ఆటో ఈడీ రాకేశ్ శర్మ స్పష్టం చేశారు.




## ఏఐ ఇమేజింగ్ ఫీచర్‌తో 5 జీ స్మార్ట్‌ఫోన్
### *సోనీతో కలిసి తెస్తున్న రియల్‌మీ*

బ్యాంకాక్, జూలై 5: జపాన్ ఎలక్ట్రానిక్స్ దిగ్గజం సోనీ భాగస్వామ్యంలో కృత్రిమ మేధస్సు (ఏఐ) ఆధారిత ఇమేజింగ్ ఫీచర్‌తో ఓ 5జీ స్మార్ట్‌ఫోన్‌ను చైనాకు చెందిన సంస్థ రియల్‌మీ తీసుకొస్తున్నది. రియల్‌మీ 13 ప్రో సిరీస్ 5జీలో సోనీ ఎల్‌వైటీ-701 కెమెరా సెన్సార్‌ను పెట్టనున్నారు. ఈ మేరకు ఇక్కడ జరిగిన ఓ ప్రీ-లాంచ్ ఈవెంట్‌లో రియల్‌మీ అధికార వర్గాలు వెల్లడించాయి. ఇదే జరిగితే ప్రపంచంలోనే ఈ కెమెరా సెన్సార్ ఫీచర్‌తో వస్తున్న మొదటి మొబైల్ రియల్‌మీదే కానున్నదంటున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లోకి వస్తున్న ప్రతీ స్మార్ట్‌ఫోన్‌లో కెమెరా, దాని మెగాపిక్సల్, సెన్సార్ పరిమాణం, లెన్స్ టెక్నాలజీలే ప్రధానమైపోయాయి. అందుకే అత్యంత నాణ్యమైన ఫొటోల కోసం 50 మెగాపిక్సల్ కలిగిన సోనీ ఎల్‌వైటీ-701 కెమెరా సెన్సార్‌ను తమ కొత్త మాడల్ మొబైల్‌లో పెడుతున్నామని ప్రముఖ మొబైల్ తయారీ కంపెనీ ఒప్పో అనుబంధ సంస్థ అయిన రియల్‌మీ చెప్పున్నది. అయితే దీని ధర, ఇతర ఫీచర్లు, మార్కెట్‌లోకి అందుబాటులోకి వచ్చే తేదీ తెలియాల్సి ఉన్నది.

## ఫారెక్స్ రిజర్వులు డౌన్

ముంబై, జూలై 5: విదేశీ మారకం నిల్వలు మరింత కరిగిపోయాయి. జూన్ 28తో ముగిసిన వారాంతానికిగాను ఫారెక్స్ రిజర్వులు 1.713 బిలియన్ డాలర్లు తరిగిపోయి 651.997 బిలియన్ డాలర్లకు పరిమితమైనట్లు రిజర్వుబ్యాంక్ తాజాగా వెల్లడించింది. అంతక్రితం వారంలోనూ రిజర్వులు 2.922 బిలియన్ డాలర్లు తరిగిపోయిన విషయం తెలిసిందే. విదేశీ కరెన్సీ రూపంలో ఉన్న ఆస్తుల విలువ తగ్గడమే ఇందుకు కారణమని తెలిపింది. గతవారంలో ఈ ఆస్తులు 1.252 బిలియన్ డాలర్లు తగ్గి 572.881 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. పసిడి రిజర్వులు 56.528 బిలియన్ డాలర్లకు చేరాయి.

## నైనీ కోల్‌బ్లాక్‌కు 643 హెక్టార్ల అటవీభూమి

హైదరాబాద్, జూలై 5 (నమస్తే తెలంగాణ) : సింగరేణి సంస్థ ఒడిశాలో చేపట్టిన నైనీ కోల్‌బ్లాక్‌లో మరో ముందడుగు పడింది. అత్యంత కీలకమైన 643 హెక్టార్ల అటవీ భూమిని ఒడిశా సర్కార్..సింగరేణి సంస్థకు బదలాయించింది. నైనీ కోల్‌బ్లాక్‌ను 2015లోనే సింగరేణి దక్కించుకున్నది. ఈ బ్లాక్‌కు ఇప్పటికే అన్ని రకాల అనుమతులు మంజూరుకావడంతో వచ్చే మూడు నెలల్లో ఈ బ్లాక్ నుంచి బొగ్గు ఉత్పత్తిని ప్రారంభించాలనుకుంటున్నది. భూమి బదలాయింపుల కోసం సింగరేణి సంస్థ రూ.180 కోట్లను ఒడిశా ప్రభుత్వానికి చెల్లించింది కూడా. వాస్తవానికి ఈ ప్రాజెక్ట్ కోసం 783 హెక్టార్ల అటవీ భూమిని బదలాయించాలని కోరినప్పటికీ.. తాజాగా 643 హెక్టార్ల భూమిని ఒడిశా ప్రభుత్వం బదలాయించింది. ఏడాదికి 10 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా సింగరేణి నైని బొగ్గుగనిని చేపట్టింది.

## 275 మి.టన్నులకు స్టీల్ డిమాండ్

- **వచ్చే పదేండ్లలో చేరుకోవచ్చన్న డెలాయిట్ తాజా సర్వే**
- **తెలంగాణలో తలసరి ఉక్కు వినిమయం 156 కిలోలు**



హైదరాబాద్, జూలై 5: తెలంగాణలో స్టీల్ వినిమయం భారీగా పుంజుకుంటున్నది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా 5.48 మిలియన్ టన్నుల స్టీల్‌ను వినియోగం జరిగింది. అంటే 3.5 కోట్ల జనాభా కలిగిన రాష్ట్రంలో ఒక్కో వినియోగదారుడు సగటున 156.43 కిలోల స్టీల్‌ను వినియోగించారని డెలాయిట్ విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. హైదరాబాద్‌లో జరుగుతున్న ఐఐఎస్ స్టీల్ ఇన్‌ఫ్రాబిల్డ్ సమ్మిట్‌లో ఈ నివేదికను విడుదల చేసింది. అంతక్రితం ఏడాదిలో 4.73 మిలియన్ టన్నులుగా ఉన్నది. దేశవ్యాప్తంగా తలసరి స్టీల్ వినిమయం 93.4 కిలోలు కాగా, తెలంగాణలో ఇంతకంటే అధికంగా ఉన్నదని పేర్కొంది. రాష్ట్రవ్యాప్తంగా పారిశ్రామిక రంగం పరుగులు పెడుతుండటం ఇందుకు కారణమని వెల్లడించింది. అలాగే ప్రతియేటా 7.3 శాతం వృద్ధితో వచ్చే పదేండ్లలో దేశవ్యాప్తంగా స్టీల్‌కు డిమాండ్ 221-275 మిలియన్ టన్నులుగా ఉంటుందని పేర్కొంది. స్టీల్ వినిమయంలో మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, గుజరాత్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలు అగ్రస్థానంలో నిలుస్తున్నాయని, మొత్తం వినిమయంలో వీటి వాటా 41 శాతంగా ఉందని వెల్లడించింది.

**సెయిల్ 6,500 కోట్ల పెట్టుబడి**

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.6,500 కోట్ల మేర పెట్టుబడులు పెట్టబోతున్నట్లు స్టీల్ ఆథార్టీ ఆఫ్ ఇండియా(సెయిల్)సీఎండీ అమరేందు ప్రకాశ్ తెలిపారు. వచ్చే కొన్నేండ్లలో లక్ష కోట్ల రూపాయల పెట్టుబడుల్లో భాగంగా ఈ ఏడాది వ్యాపార విస్తరణకోసం ఈ నిధులను ఖర్చు చేయబోతున్నట్లు చెప్పారు. చైనా నుంచి దిగుమతవుతున్న నాసిరకం స్టీల్‌ను నియంత్రించడానికి కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఉన్నదన్నారు.

# లక్ష కోట్లకు ఫార్మా ఎగుమతులు

- **డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**



*హెటిరో గ్రూపు వైర్మన్ పార్థసారథి రెడ్డిని మెమొంటోతో సత్కరిస్తున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి*

హైదరాబాద్, జూలై 5: హైదరాబాద్‌లో 73వ ఇండియన్ ఫార్మాస్యూటికల్ కాంగ్రెస్ ఘనంగా ప్రారంభమైంది. తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ముఖ్య అతిథిగా హాజరై శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..దేశీయంగా ఉత్పత్తి అవుతున్న ఫార్మా ఉత్పత్తుల్లో తెలంగాణ వాటా 35 శాతంగా ఉండటం రాష్ట్రానికి గర్వకారణమన్నారు. ఏటా రూ.50 వేల కోట్ల విలువైన ఔషధాలు ఎగుమతి అవుతున్నాయని, వచ్చే ఐదేండ్లలో ఇవి లక్ష కోట్లకు చేరుకుంటుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. పారిశ్రామిక ఫ్రెండ్లీ ప్రభుత్వం కావడంతో వ్యాపారవేత్తలు ఎలాంటి అనుమానాలు, భయాలు లేకుండా పెట్టుబడులు పెట్టవచ్చని ఆయన సూచించారు. రాష్ట్రంలో ఏ పరిశ్రమకు ఎలాంటి సమస్య రాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్యలో ఫార్మా క్లస్టర్‌ను నిర్మించి ఈ పరిశ్రమకు అన్ని రకాలుగా ప్రోత్సాహకాలు అందివ్వనున్నట్లు ప్రకటించారు. త్వరలో కొత్త విద్యుత్ పాలసీని తీసుకురాబోతున్నట్లు, దీంతో గ్రీన్ ఎనర్జీ, మిగులు విద్యుత్ అందుబాటులో ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ..ఆరోగ్య సంరక్షణలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడంలో ఐటీ, కృత్రిమ మేధస్సు వంటి సాంకేతికలు దోహదపడతాయన్నారు. లైఫ్ సైన్సెస్‌లో నైపుణ్యాలు పెంపొందించే లక్ష్యంతో ప్రత్యేక యూనివర్సిటీలు స్థాపించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు.

**300 కోట్లతో పల్సస్ ఫార్మా హబ్**

పల్సస్ గ్రూపు సంగారెడ్డి జిల్లాలో అమీన్‌పూర్ వద్ద ఏఐ ఆధారిత ఫార్మా హెల్త్‌కేర్ ఐటీ హబ్‌ను ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించింది. ఈ సందర్భంగా కంపెనీ సీఈవో గేదెల శ్రీనుబాబు మాట్లాడుతూ..రూ.300 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేస్తున్న ఈ హెల్త్‌కేర్ హబ్‌తో ప్రత్యక్షంగా 50 వేల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయన్నారు.

# నిఫ్టీ పైకి.. సెన్సెక్స్ కిందికి

## మిశ్రమంగా ముగిసిన స్టాక్ మార్కెట్లు

ముంబై, జూలై 5: దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం మిశ్రమంగా ముగిశాయి. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 21.70 పాయింట్లు పెరిగి ఆల్‌టైమ్ హైని నెలకొల్పుతూ మునుపెన్నడూ లేనివిధంగా 24,323.85 వద్ద స్థిరపడింది. అయితే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ మాత్రం 53.07 పాయింట్లు పడిపోయింది. దీంతో 80 వేల మార్కుకు దిగువన 79,996.60 వద్ద నిలిచింది. కాగా, ముకేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ మార్కెట్ విలువ రూ.48,723.54 కోట్లు ఎగిసి రూ.21,51,562.56 కోట్లకు చేరింది. కానీ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టైటాన్, మహీంద్రా అండ్ మహీంద్రా, ఇండస్‌ఇండ్ బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్, టాటా మోటార్స్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఏషియన్ పెయింట్స్ షేర్లు నష్టపోయాయి. అయినప్పటికీ బీఎస్ఈ నమోదిత సంస్థల మార్కెట్ విలువ ఆల్‌టైమ్ హైని తాకుతూ రూ.449.88 లక్షల కోట్లను తాకింది. ఒక్కరోజే రూ.2.48 లక్షల కోట్లు పెరిగింది.

చిత్రం

అగ్ర హీరో కల్యాణ్‌రామ్ శుక్రవారం జన్మదినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన 21వ చిత్రానికి సంబంధించిన కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మిస్తున్నారు. పవర్‌ఫుల్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో కల్యాణ్‌రామ్ పాత్ర నవ్యరీతిలో ఉంటుందని, ఫైర్ యాక్షన్ ఎపిసోడ్ హైలైట్‌గా నిలుస్తుందని చిత్ర బృందం పేర్కొంది. పోస్టర్‌లో కల్యాణ్‌రామ్ ఇంటెన్స్ లుక్‌తో కనిపిస్తున్నారు. విజయశాంతి ఐపీఎస్ అధికారి పాత్రలో నటిస్తున్న ఈ చిత్రంలో సోహైల్‌ఖాన్, సాయి మంజ్రేకర్, శ్రీకాంత్ ఇతర ముఖ్యపాత్రలను పోషిస్తున్నారు. అజనీష్ లోకేనాథ్ సంగీతాన్నందిస్తున్నారు.

**'బింబిసార'కు ప్రీక్వెల్**

'బింబిసార' చిత్రం హీరో కల్యాణ్‌రామ్ కెరీర్‌లో ప్రత్యేకంగా నిలిచిపోయింది. త్రిగర్తల సామ్రాజ్యాధిపతి అయిన బింబిసారుడిగా ఆయన నటన ప్రేక్షకుల్ని ఎంతగానో ఆకట్టుకుంది. సోషియో ఫాంటసీ డ్రామాగా రూపొందిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద కూడా భారీ వసూళ్లను రాబట్టింది. ఈ సినిమాకు రెండో భాగం ఉంటుందని గతంలోనే మేకర్స్ వెల్లడించారు. శుక్రవారం కల్యాణ్‌రామ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ సినిమా ప్రీక్వెల్ ప్రకటన చేశారు. దీనికి అనిల్ పాదూరి దర్శకత్వం వహించనున్నారు. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. 'బింబిసార కన్నా యుగాల ముందు త్రిగర్తలను ఏలిన లెజెండ్‌ని చూడడానికి సిద్ధంగా ఉండండి' అనే క్యాప్షన్‌తో ప్రీక్వెల్‌ను అనౌన్స్ చేశారు. ఈ ప్రీక్వెల్‌ను అత్యుత్తమ సాంకేతిక హంగులతో తెరకెక్కించబోతున్నామని చిత్ర బృందం పేర్కొంది. ఎన్టీఆర్ ఆర్ట్స్ పతాకంపై రూపొందనున్న ఈ సినిమా ప్రస్తుతం పూర్వ నిర్మాణ కార్యక్రమాలను జరుపుకుంటున్నది. త్వరలో ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నారు.

## ఆర్థిక అంతరాల 'కుబేర'

అగ్ర కథానాయిక రష్మిక మందన్న వరుసగా భారీ చిత్రాలతో బిజీగా ఉంది. అందులో 'కుబేర' సినిమా ఒకటి. ధనుష్, నాగార్జున ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ పాన్ ఇండియా మల్టీస్టారర్ చిత్రం నిర్మాణం నుంచే ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతున్నది. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం ప్రస్తుతం హైదరాబాద్‌లో షూటింగ్ జరుపుకుంటున్నది. శుక్రవారం రష్మిక మందన్న ఫస్ట్‌లుక్‌తో పాటు క్యారెక్టర్ ఇంట్రడక్షన్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. ట్రాలీ బ్యాగ్ పట్టుకొని కాస్త భయంతో కూడిన చూపులతో ఫస్ట్‌లుక్ పోస్టర్ అందరిలో ఇంట్రెస్ట్ క్రియేట్ చేస్తున్నది. ఈ సోషల్‌డ్రామాలో రష్మిక మందన్న పాత్ర కీలకంగా ఉంటుందని చిత్రబృందం పేర్కొంది. సమాజంలోని సాంఘిక, ఆర్థిక అంతరాలను చర్చిస్తూ దర్శకుడు శేఖర్ కమ్ముల ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారని సమాచారం. ఈ చిత్రాన్ని సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు సంయుక్తంగా నిర్మిస్తున్నారు.



## రెండింతల వినోదం గ్యారెంటీ

రామ్ పోతినేని కథానాయకుడిగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో రూపొందిస్తున్న 'డబుల్ ఇస్మార్ట్' చిత్రం షూటింగ్‌ను పూర్తి చేసుకుంది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఆగస్ట్ 15న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా శుక్రవారం కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఇటీవలే విడుదల చేసిన 'స్టెప్పా మార్' పాటకు మంచి స్పందన లభించిందని, ఓల్డ్‌సిటీ శంకర్‌గా రామ్ పాత్ర మాస్ అంశాలతో ఆకట్టుకుంటుందని, ప్రేక్షకులకు డబుల్ ఎంటర్‌టైన్‌మెంట్ గ్యారంటీ అని చిత్ర బృందం పేర్కొంది. కావ్య థాపర్, అలీ, గెటప్ శ్రీను తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సాయి కె నాయుడు, జియాని జియాన్నెలి, సంగీతం: మణిశర్మ, నిర్మాతలు: పూరి జగన్నాథ్, ఛార్మికౌర్, రచన-దర్శకత్వం: పూరి జగన్నాథ్.

# ఆ ప్రేరణతోనే కల్కి తీశా!

**' 'కల్కి 2898 ఏడీ' ఓ గొప్ప సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చిందని అందరూ అంటున్నారు. నాలాంటి మేకర్స్ ముఖ్య ఉద్దేశం కూడా అదే. థియేటర్స్‌కి వెళ్లిన ఆడియన్స్ సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ పొందాలి. 'కల్కి' లాంటి సినిమాను తీసినందుకు దర్శకుడిగా గర్విస్తున్నాను. అమితాబ్, కమల్‌హాసన్, ప్రభాస్, దీపిక పదుకొనే వంటి సూపర్‌స్టార్స్‌ని డైరెక్ట్ చేయడం నా అదృష్టం' అంటూ ఆనందం వ్యక్తం చేశారు దర్శకుడు నాగఅశ్విన్. ఆయన దర్శకుడిగా గత నెల 27న విడుదలైన 'కల్కి 2898ఏడీ' ప్రపంచవ్యాప్తంగా వసూళ్ల సునామీని సృష్టిస్తున్నది. ఈ సందర్భంగా హైదరాబాద్ శివారులో ఉన్న శంకరపల్లిలోని 'కల్కి సెట్స్'లో దర్శకుడు నాగ్‌అశ్విన్ విలేకరులతో ముచ్చటించారు.**

- తెలుగు సినిమా అంటే గుర్తొచ్చేది 'మాయాబజార్'. అది మహాభారతానికి అడాప్టేషన్. నిజానికి భారతంలో ఆ కథ లేదు. అదొక క్రియేటివ్ ఫిక్షన్. ఆ ప్రేరణతోనే 'కల్కి' తీశాను. ఈ సినిమా ద్వారా మహాభారతంలోని ఒరిజినల్ హీరోల గురించి పిల్లలు తెలుసుకుంటారనే ఉద్దేశం కూడా ఈ కథ రాసుకోవడానికి ఓ కారణం. మన కథలనే ప్రేరణగా తీసుకొని మరీ డార్క్‌గా కాకుండా అందరికీ అర్థమయ్యేలా లైట్ హార్టెడ్‌గా తీయడం జరిగింది.
- ముందుగా ఒక సినిమానే అనుకున్నా. కానీ కొన్ని షెడ్యూల్స్ అయ్యాక ఈ కథను రెండు గంటల్లో చెప్పలేం అనిపించింది. అందుకే పార్టులుగా చేయాలని నిర్ణయించాం. పార్ట్- 2కి సంబంధించి 20రోజుల షూటింగ్ పూర్తయింది. ఇంకా యాక్షన్, బ్యాక్ స్టోరీస్ ఇలా చాలా చేయాలి, మరో కొత్త ప్రపంచాన్ని చూపించాలి. నేను ఇంత భారీ సినిమా తీశానంటే కారణం నా నిర్మాతలే. కథకు న్యాయం చేయడానికి ఎంత ఖర్చుకైనా వారు వెనకాడలేదు. అమితాబ్, కమల్, ప్రభాస్, దీపికా లాంటి స్టార్స్ ఇందులో చేశారంటే కారణం అదే.
- కల్కి ఓ భారీ ప్రయోగం. ముందుముందు ఈ కథలో చాలా పాత్రలు వస్తాయి. తొలి పార్ట్‌లో పాత్రలు, వాటి శక్తియుక్తులు అందరికీ తెలిసిపోయాయి. ఇకపై ఇంకా ఫన్‌గా ఉంటుంది. ప్రభాస్ క్యారెక్టర్ సెకండ్ పార్ట్‌లో హైలైట్‌గా ఉంటుందని చెప్పగలను. అలాగే అమితాబ్, కమల్ పాత్రలు నెక్ట్స్ లెవల్లో ఉంటాయి. ఇందులో చివరికి యాస్కిన్ ఫిలాసఫీ ప్రపంచానికి తెలియజెప్పడానికే శ్రీశ్రీగారి మహాప్రస్థానంలోని లైన్స్ చెప్పించాం. అవి బాగా సెట్ అయ్యాయి.
- కల్కి సెకండ్‌పార్ట్ చాలా మ్యాసీవ్‌గా ప్లాన్ చేస్తున్నాం. కర్ణుడి పాత్ర గురించి వచ్చేవన్నీ అర్థరహితమైన విమర్శలే. కర్ణుడి పాత్ర చాలా పాజిటీవ్. దేశంలో ఆ పాత్రను ప్రేమించేవారు అధికంగా ఉన్నారు. 'కల్కి'ని రెండోసారి చూస్తేగానీ, కర్ణుడి పాత్ర గురించి క్లారిటీ రాదు. సెకండ్‌టైమ్ వర్త్ వాచ్ మూవీ ఇది.
- 50 ఏళ్ల వైజయంతీ సంస్థలో ఇది వన్ ఆఫ్‌ది మోస్ట్ ఎక్స్‌పెన్సీవ్ ఫిల్మ్. ఈ సినిమా ఇంతటి గొప్ప సక్సెస్ సాధించడంతో పాటు పెట్టిన పెట్టుబడి మొత్తం తిరిగి రావడంతో కొండంత భారం దిగినట్టనిపించింది. వైజయంతీలో పనిచేసిన అందరూ దాదాపుగా ఇందులో నటించారు. నాని, నవీన్ పొలిశెట్టి తప్ప. డెఫినెట్‌గా నెక్ట్స్ పార్ట్‌లో ఎక్కడ ఛాన్స్ దొరికితే అక్కడ వాళ్లని పెట్టేస్తాను.(నవ్వుతూ). అలాగే భారతీయ సినిమా నడకను మార్చిన దర్శకులు ఆర్జీవీ, రాజమౌళి. వీరిద్దర్నీ డైరెక్ట్ చేయడం గొప్ప అనుభూతి. ఆర్జీవీగారిని చేయమని అడిగప్పుడు.. 'నేనెందుకు?' అనడిగారు. 'కలియుగంలో మీరుండాలి' అని చెప్పాను.( నవ్వుతూ).

## అనాథల జీవిత చిత్రం

ఏబీసీడీ ప్రొడక్షన్స్ సంస్థ రూపొందిస్తున్న చిత్రం 'గల్లీ గ్యాంగ్ స్టార్స్'. ధర్మ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ నెల 26న ప్రేక్షకుల ముందుకురానుంది. దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'నెల్లూరులో చిత్రీకరణ జరిపాం. ఒక గల్లీలో నివసించే అనాథలు, వాళ్లు ఎదురుకునే సమస్యల సమాహారంగా కథ నడుస్తుంది. క్రైమ్ డ్రామాగా మెప్పిస్తుంది. సినిమా మొత్తం నాలుగు ముఖ్య పాత్రల మీద నడుస్తుంది' అని చెప్పారు. సంజయ్ శ్రీ రాజ్, ప్రియ శ్రీనివాస్, భరత్, రితిక తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి నిర్మాత: అరవేటి యశోవర్ధన్, సంగీతం: సత్య, శరత్ రామ్ రవి.

## సందేశంతో 'పౌరుషం'

సుమన్ తల్వార్, మేకా రామకృష్ణ, షెరాజ్, అశోక్ ఖుల్లార్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'పౌరుషం'. షెరాజ్ మెహ్దీ దర్శకుడు. అశోక్ ఖుల్లార్, దేవేంద్ర నేగి నిర్మాతలు. అమెరికా లాస్‌ఏంజిల్స్‌లో ఈ చిత్ర ట్రైలర్‌ను విడుదల చేశారు. ఉమ్మడి కుటుంబాల్లో ఎదురయ్యే సమస్యలను చర్చిస్తూ, పాత సంప్రదాయాలను ప్రశ్నిస్తూ ఎమోషనల్ ఫీల్‌తో ట్రైలర్ సాగింది. నేటి తరానికి చక్కటి సందేశంతో ఈ చిత్రాన్ని రూపొందించామని దర్శకుడు తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం, కథ, మాటలు, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: షెరాజ్ మెహ్దీ.

## లేడీ గూఢచారి అలియా



స్పై యూనివర్స్ కథల్ని తెరకెక్కించడంలో యష్‌రాజ్ ఫిల్మ్స్‌ది ప్రత్యేకస్థానం. ఇప్పుడు తొలిసారిగా ఈ తరహా కథనే నిర్మిస్తూ కొత్త ప్రయోగానికి నాంది పలికారు యష్‌రాజ్ సంస్థవారు. ఈ సంస్థ నుంచి దేశంలోనే తొలిసారిగా లేడీ ఓరియెంటెడ్ స్పై మూవీ రానుంది. ఇందులో లేడీ స్పైగా అలియాభట్ లీడ్‌రోల్‌ను పోషించనుంది. ఆదిత్య చోప్రా నిర్మిస్తున్న చిత్రంలో శార్వారి కూడా మరో కీలక పాత్ర పోషిస్తున్నది. ఇందులో అలియాతోపాటు శార్వారీ కూడా స్పై ఏజెంట్‌గా కనిపించనుంది. ఈ సినిమాకు 'ఆల్ఫా' అనే పేరును ఖరారు చేశారు. 'ఆల్ఫా' అనే టైటిల్‌కి మగవారు మాత్రమేకాదు.. మహిళలూ అర్హులే అని చాటిచెప్పేలా ఈ సినిమా ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. 'నిశితంగా గమనించండి.. ప్రతి నగరం ఒక అడవే.. ప్రతి అడవినీ ఏలేది.. ఆల్ఫ